మైనార్టీ గురుకులాల్లో పోస్టులకు దరఖాస్తులు

నీలగిరి, జూన్ 21 : నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్న మైనారిటీ గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులు, కళాశాలలో లెక్చరర్‌గా పని చేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి టి.విజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యం, అనుభవం, ఆంగ్ల భాషా పరిజ్ఞానం, డెమో ఆధారంగా మెరిట్ జాబితా తయారు చేసి ఔట్ సోర్సింగ్ విధానంలో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా మూడు సంవత్సరాల అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

నాన్ టీచింగ్ సిబ్బంది డీఈఓ, హాస్టల్ వార్డెన్, స్టాఫ్‌నర్స్ కోసం ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ కార్యాలయంలో లేదా మిర్యాలగూడ రోడ్డులోని రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ కార్యాలయంలో జూన్ 26న సాయంత్రం 5 గంటల వరకు సమర్పించాలని పేర్కొన్నారు.

కేసీఆర్‌తోనే నాణ్యమైన కరెంట్

కనెక్షన్లు పెరిగినా అంతరాయం లేని సరఫరా



- రూ.100 కోట్లతో సరఫరా వ్యవస్థ బలోపేతం
- ఒక్క నల్లగొండ జిల్లాలోనే రూ.1,100 కోట్ల వ్యయం
- ప్రజలకు భారీగా తగ్గిన మరమ్మతుల ఖర్చులు
- మాజీ సీఎం కేసీఆర్ చిత్తశుద్ధితోనే సాధ్యమైందంటున్న సబ్బండవర్గాలు

నల్లగొండ ప్రతినిధి, జూన్21(నమస్తే తెలంగాణ) : దేశంలోనే తొలిసారిగా గృహవసరాలు, వ్యవసాయంతో పాటు పరిశ్రమలకు సైతం 24 గంటల నిరంతర కరెంట్ ఇచ్చిన ఘనత తెలంగాణ రాష్ర్టానికే దక్కింది. ఉద్యమ కాలంలో వచ్చీరాని కరెంట్ కష్టాలు చూసి చలించిపోయిన కేసీఆర్ అప్పుడే దీనిపై ప్రణాళికలకు రూపకల్పన చేశారు. రాష్ట్రం సాధించాక తొలి సీఎంగా కేసీఆర్ మూడున్నర ఏండ్లల్లోనే పూర్తిస్థాయిలో అన్ని వర్గాలకు నిరంతర కరెంట్‌కు శ్రీకారం చుట్టారు. అది కూడా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చిత్తశుద్ధితో చర్యలు చేపట్టారు. సరఫరా జరిగే కరెంట్‌లో అంతరాయం ఉండకూడదని అప్పటికే ఉన్న విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా వేల కోట్ల రూపాయలను వెచ్చించారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే సుమారు రూ.1100 కోట్లకు పైచిలుకు ఖర్చు చేయడం విశేషం. దాంతో లోఓల్టేజీ సమస్య, తరుచూ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం, సబ్ స్టేషన్లలో ట్రిప్ కావడం లాంటి అంతరాయాలకు చెక్ పెట్టగలిగారు. దీనికి విద్యుత్ శాఖ వెల్లడిస్తున్న అధికారిక గణంకాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి సీఎం కేసీఆర్ కార్యదీక్షతోనే నాణ్యమైన విద్యుత్ సాధ్యమైందన్నది కాదనలేని సత్యం.

తగ్గిన మరమ్మతులు

స్వరాష్ట్రం ఏర్పడే నాటికి ఉమ్మడి జిల్లాలో 2.90లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉండేవి. గత వేసవి నాటికి అవి 4.65లక్షలకు పెరిగాయి. సుమారు 1.75లక్షల కనెక్షన్లు అదనంగా పెరిగాయి. ఇందులోనూ 2018 జనవరి 1 నుంచి కేసీఆర్ నిరంతర ఉచిత కరెంట్‌కు శ్రీకారం చుట్టిన అనంతరం అదనంగా పెరిగినవే 97వేలు. అయినా ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా నిరంతరం నాణ్యమైన కరెంట్ సరఫరా జరిగింది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిరంతర విద్యుత్‌కు తోడు ప్రకృతి సహకరించడంతో గత నాలుగున్నరేండ్లుగా విద్యుత్ సమస్యలు రాలేదు. రైతుల ఆందోళనలు సైతం మచ్చుకు కూడా కానరాలేదు. అందుకు కారణం క్షేత్రస్థాయిలో సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే. ఉమ్మడి జిల్లాకు చెందిన గంటకండ్ల జగదీశ్‌రెడ్డి అప్పుడు విద్యుత్ శాఖ మంత్రి కావడం కూడా జిల్లాకు అదనంగా కలిసివచ్చింది. ప్రత్యేక శ్రద్ధతో ఉమ్మడి జిల్లా పరిధిలో విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేశారు. కొత్త జిల్లాల ప్రకారం నల్లగొండ జిల్లాలో 2014లో 1.40లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉంటే అవి 2.15లక్షలకు పెరిగాయి. వీటికి అనుగుణంగా నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్లు, కరెంట్ లైన్ల విస్తరణ కూడా భారీగా జరిగింది. 2014లో 132/33 కేవీ సబ్ స్టేషన్లు కేవలం 8 ఉంటే కేసీఆర్ సర్కార్ హయాంలో అదనంగా రూ.75కోట్లను వెచ్చించి 13కు పెంచారు. ఇక 33/11కేవీ సబ్ స్టేషన్లు 2014లో 123 ఉంటే ఏండెండ్లలో రూ.85.93కోట్లు వెచ్చించి 168కి పెంచారు. ఇక నల్లగొండ సర్కిల్‌లో విద్యుత్ లైన్ల విస్తరణను పరిశీలిస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా కనిపిస్తుంది. 33కేవీ ఓహెచ్ లైన్ అప్పట్లో 900 కిలోమీటర్ల మేర ఉంటే దాన్ని రెట్టింపు స్థాయిలో 1,825 కిలోమీటర్లకు విస్తరించారు. ఇందుకోసం అదనంగా రూ.74 కోట్లను వెచ్చించారు. 11కేవీ ఓహెచ్ లైన్‌ను 6,526 కిలోమీటర్ల నుంచి రూ.520 కోట్లను వెచ్చించి 14013 కిలోమీటర్లకు విస్తరించారు. ఎల్‌టీ లైన్లను 2,3046కిలోమీటర్ల నుంచి 32,415 కిలోమీటర్లకు రూ.232కోట్లను వెచ్చించి విస్తరించారు. ఇక క్షేత్రస్థాయిలో కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్లు 2014 జూన్ 2 నాటికి మొత్తం 36,447 ఉంటే ఈ ఏడాది మార్చి చివరి నాటికి రూ.183.96కోట్లను ఖర్చు చేసి 69,787కు పెంచారు. అంటే గృహ, పరిశ్రమలతో పాటు వ్యవసాయానికి నిరంతర సరఫరాతోపాటు నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు కేసీఆర్ సర్కార్ ఇచ్చిన ప్రాధాన్యత ఏంటో పైలెక్కలే స్పష్టం చేస్తున్నాయి. దీని వల్ల భారీగా మరమ్మతులు తగ్గిపోయాయి. ప్రజలపై భారం కూడా పూర్తిగా తగ్గిపోవడం కాదనలేని సత్యం. ఈ ఘనత అంతా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని ప్రజలు ఘంటాపథంగా చెబుతున్నారు. గతంలో ఎవ్వరూ నిరంతర సరఫరాతో పాటు నాణ్యమైన కరెంట్‌పై కనీసం ఆలోచన చేసిన దాఖలాలు కూడా లేవంటున్నారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా, అభాండాలు వేసినా ప్రజలతో పాటు రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం పట్ల, రాష్ట్ర పురోగతి పట్ల కేసీఆర్‌కు ఉన్న చిత్తశుద్ధిని ఎవ్వరూ శంకించలేరని స్పష్టం చేస్తున్నారు.

గంటకోసారి కరెంట్ పోతది

కాంగ్రెస్ సర్కారు వచ్చినంక గంటకోసారి కరెంట్ పోతున్నది. హొటల్, కిరాణం షాపు సరిగా నడుస్త లేదు. కస్టమర్లు అడిగితే ఏం చెప్పాలో తెల్వక ఇబ్బందులు పడుతున్నాం. కరెంట్ ఉంటేనే మా పని నడుస్తుంది. కరెంట్ పోయినంత సేపు నాతో పాటు ఇద్దరు వక్కర్లు కూడా ఖాళీగా కూర్చుంటున్నాం. పని చేసేటప్పుడు కరెంట్ పోతే చిరాకు అనిపిస్తది. ఇక పని అక్కడే ఆగిపోతది. గత ప్రభుత్వ హయాంలో 24గంటలు కరెంట్ ఉండేది. కరెంట్ పోవుడు చాలా తక్కువ. అప్పుడు పని మంచిగా సాగింది. కరెంట్‌పై గత ప్రభుత్వాన్ని నిందించడం కంటే ఎలాంటి చర్యలు తీసుకుంటే ప్రజలకు 24గంటలు నాణ్యమైన విద్యుత్ అందించగలమో ప్రస్తుత సర్కారు ఆలోచన చేయాలి.

- బొమ్మిశెట్టి వీరబాబు, చౌటపల్లి గ్రామం, మఠంపల్లి మండలం

కరెంట్ కష్టాలు తీర్చింది కేసీఆరే

గతంలో సాగునీరు లేక పంటలు పండించే పరిస్థితి లేక చాలా మంది రైతులు పొలాలను వదిలేసి బతుకుదెరువు కోసం పట్టణాలకు వలసపోయారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చినంక రాష్ట్రం పాడి పంటలతో సస్యశ్యామం అయ్యింది. కేసీఆర్ హయాంలో పదేండ్లు కరెంట్ రోజంతా ఉండేది. ఎప్పుడైనా పొలానికి వెళ్లి బోర్లు వేసుకుని పంటలు పండించుకునేటోళ్లం. ఊళ్లు విడిచిపోయిన రైతులు మళ్లీ సొంతూరికి వచ్చి సంతోషంగా సాగు చేసుకొని బతుకుతున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన కొన్ని రోజుల్లోనే కరెంట్ కోతలు మొదలైనయి. వర్షాలు లేక, సాగునీరు లేక దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాం. 2014 సంవత్సరానికి ముందు కరెంట్ కోసం ఎంత తండ్లాడామో ఇప్పటికీ గుర్తున్నది. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. రాత్రిళ్లు మోటర్ల కాడనే పడుకొని ఇబ్బందులు పడినం. కేసీఆర్ సార్ వచ్చినంక కరెంట్ బాధలు లేకుండా గడిపినం. ఇప్పుడేమో మళ్లీ పాత రోజులొస్తాయని భయమైతుంది. నా కున్న మూడెకరాల్లో వానకాలం సాగు చేద్దామంటే కరెంట్ ఇబ్బందులున్నయ్. వానలు కురవక ఆకాశం వైపు చూస్తున్నం. ఉన్న నీటిని పారించి సాగు చేద్దామన్నా కరెంట్ తిప్పలు తప్పడం లేదు.

- రమావత్ గన్నానాయక్, రైతు, చేపూరుతండా(చెన్నారం), కొండమల్లేపల్లి మండలం

గత పదేండ్లలో కరెంట్‌కు ఇబ్బంది లేకుండె

కరెంట్ కోతలతో వ్యాపారం చేసుకోలేక పోతున్నాం. కేసీఆర్ ప్రభుత్వంలో విద్యుత్ సమస్యలు లేకుండే. ఎండాకాలంలో కూడా కటింగ్ లేకుండే. 24 గంటలు కరెంట్ ఉండడం వల్ల సాఫీగా పనులు చేసుకునేవాళ్లం. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక కరెంట్ కోతలు ఎక్కువయ్యాయి. అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పోయిన సర్కారుకు, ఇప్పటి సర్కారుకు చాలా తేడా ఉన్నది.

-ప్రతాప్, బేకరీ యజమాని, బీబీనగర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జిల్లా కేంద్ర దవాఖానపై కలెక్టర్ స్పెషల్ ఫోకస్

- డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి
- వారం రోజుల్లో స్పష్టమైన మార్పు కనబడాలి
- ఇక నుంచి రోజూ రెండు గంటలు అదనపు కలెక్టర్, ప్రతివారం నేను స్వయంగా సమీక్షిస్తాం
- డబ్బులు వసూలు చేస్తే జైలుకు పంపుతాం
- ప్రభుత్వ మెడికల్ కళాశాల సమీక్షా సమావేశంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నీలగిరి, జూన్ 21 : పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు నల్లగొండ కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా కేంద్ర దవాఖానపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గతంలో మాదిరిగా ఉంటే సరిపోదని వైద్యులు, సిబ్బంది తమ డ్యూటీ సమయంలో ఆస్పత్రిలో ఉండాలని, పారిశుద్ధ్య నిర్వహణ విద్యుత్, తాగు నీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఇక నుంచి ప్రతినిత్యం పర్యవేక్షణ ఉంటుందని, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిరోజూ రెండు గంటలు, తాను వారానికి ఒకసారి సమీక్ష చేస్తామని చెప్పారు. ప్రతి రోజూ ఒక జిల్లా స్థాయి అధికారి ఆస్పత్రికి వచ్చి హాజరు పర్యవేక్షిస్తారని తెలిపారు. నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వైద్యులు, అధికారులు, హెచ్‌ఓడీలు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్‌తో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని సందర్శించానని, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రిలో అనేక మార్పులు రావాల్సి ఉందని తెలిపారు. అధికారులు, డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. దవాఖానలో శానిటేషన్‌ను మెరుగుపరిచి ప్రభుత్వ ఆస్పత్రుల గౌరవాన్ని పెంపొందించాలన్నారు. దవాఖానలో ఏ సమస్య ఉన్నా తమ హెచ్‌ఓడీల ద్వారా తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు. కింది స్థాయి సిబ్బంది ప్రవర్తనలో మార్పు రావాలని, రోగులు, వారి సహాయకుల నుంచి ఎవరైనా డబ్బులు అడిగితే జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ జీతం పొందుతూ పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజల కోసమే పనిచేయాలని, లేకుంటే వారే స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని చెప్పారు. ఆస్పత్రిలో వారం రోజుల్లో స్పష్టమైన మార్పు కనబడాలని, డిపార్ట్‌మెంట్ వారీగా సమీక్ష నిర్వహిస్తామని, అందుకు హెచ్‌ఓడీలు కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా ఆస్పత్రిలోని అన్ని విభాగాలు, హెచ్‌ఓడీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. అత్యవసర మందులను ఏర్పాటు చేస్తామని, ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ నిత్యానంద్, డీసీహెచ్‌ఎస్ మాతృ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజకుమారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళ్యాణ్ చక్రవర్తి, టీఎస్ ఎంఐడీసీ, విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఆయా విభాగాల హెచ్‌ఓడీలు, స్టాఫ్‌నర్స్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ విభాగాల వైద్యాధికారులు, సిబ్బంది

బైపాస్ బాధితుల పోరుబాట

- నల్లగొండ కలెక్టరేట్‌కు చేరిన ఆందోళన
- మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్‌ను కలిసిన బాధితులు
- అనుచరులకు దోచిపెట్టేందుకే మంత్రి కోమటిరెడ్డి పన్నాగం : కంచర్ల

మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రింగ్ రోడ్డు బాధితులు

నల్లగొండ, జూన్ 21 : నల్లగొండ ఔటర్ రింగ్ రోడ్డును ఇష్టారాజ్యంగా మార్చి తన అనుచరులకు దోచి పెట్టేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుట్ర పన్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి ఆరోపించారు. మూడు వేల కుటుంబాలకు గూడు లేకుండా చేసి వారి జీవితాలతో చెలగాటం ఆడటం మంచిది కాదన్నారు. నల్లగొండ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌లో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితులతో కలిసి శుక్రవారం ఆయన కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం భూపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా చేసిన బైపాస్ రోడ్ నిర్మాణ ప్రతిపాదనలను 15 రోజుల్లోగా ఉపసంహరించుకోకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు. బాధితులతో కలిసి పాదయాత్ర చేసి ప్రతి ఒక్కరినీ కదిలిస్తానని, అందరినీ ఉద్యమానికి మద్దతుగా కలిసి వచ్చేలా చేస్తానని చెప్పారు. బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ప్రతిపాదించిన ఆప్షన్ వన్, ఆప్షన్ టు వల్ల నల్లగొండ పట్టణం మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని, ఎవరికీ పెద్దగా నష్టం జరుగదని తెలిపారు. ఆప్షన్ త్రీ వల్ల చాలామందికి అన్యాయం జరుగుతుందని చెప్పారు.

సమస్యను పరిష్కరించాలని బాధితులు మంత్రి కోమటిరెడ్డి వద్దకు వెళ్తే వారి పట్ల అనుచితంగా ప్రవర్తించి పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లు, నివాస గృహాలకు నష్టం జరుగకుండా ఆప్షన్ వన్ లేదా ఆప్షన్ టు ఎంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు కాంచనపల్లి రవీందర్‌రావు, జమాల్ ఖాద్రి, మారగోని గణేశ్, మెరుగు గోపి, శంషొద్దీన్, గంజి రాజేందర్, శ్రీనివాస్, దొడ్డి రమేశ్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో పథకాలు అమలు చేయాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జూన్ 21 : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల భాగస్వామ్యంతో చేసినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులు, పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా స్వయం సహాయ సంఘాలకు అందించే రుణాలు మహిళల ఆర్థిక బలోపేతానికి ఉపయోగపడాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు అందించి వంద శాతం ఉపాధి పని దినాలు కల్పించాలని తెలిపారు. మహిళా శక్తిపై ఉన్న అంశాలకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. స్త్రీ నిధి లోన్ మంజూరు చేసే క్రమంలో డాక్యుమెంటేషన్ కచ్చితంగా చేయాలన్నారు. పశు సంవర్థక శాఖ ద్వారా యునిట్ల గుర్తించి అవులు, గేదేలను అందించాలని చెప్పారు. మత్స్య శాఖ ద్వారా అర్హులైన వారికి రూ.పది లక్ష రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెరుగాలన్నారు. ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, పీఎంఓలు పర్యవేక్షణలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో 1, 11, 21వ తేదీల్లో వాటర్ ట్యాంకులను శుభ్రంచేయాలని చెప్పారు. వానకాలం సాగు చేయడానికి వరి, పత్తి, కంది, పెసర పంటలకు సరిపడా విత్తనాలు రైతులకు అందించాలన్నారు. జిల్లాలో 32 వేల ప్యాకెట్ల పత్తి విత్తనాలు, 17 వేల క్వింటాళ్ల వరి విత్తనాలతో పాటు ఎరువులు సైతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమీక్షలో డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఏఓ శ్రీధర్‌రెడ్డి, పంచాయతీ అధికారి సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను పరిరక్షించాలి

- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

భీమారంలో పురాతన శివాలయాన్ని పరిశీలిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

కేతేపల్లి, జూన్ 21 : రాష్ట్రంలోని పురాతన ఆలయాలను ప్రభుత్వం పరిరక్షించాలని రాష్ట్ర పురావస్తు శాఖ పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. కేతేపల్లి మండల పరిధిలోని బీమారంలో కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన శివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ప్రవేశ మండపం, మహామండపం, గర్భ గుడిలోని గోడలు, మహా మండపం, కప్పురాళ్లు, కూలిపోవడాన్ని ఆయన పరిశీలించారు. గర్భాలయంలోని శివలింగం, నంది శిథిలమై ఉండటాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయం చుట్టూ దట్టమైన ముళ్ల పొదలు పెరిగి ఉన్నాయని తెలిపారు. 800 ఏండ్ల నాటి కట్టడాలు ఆదరణకు నోచుకోలేక నేడు శిథిలమైతున్నాయని పేర్కొన్నారు. స్థానిక చరిత్రకు నిలువుటద్దంలా ఉన్న కట్టడాలను, శిల్పాలను ప్రభుత్వం పరిరక్షించి రాబోయే తరాలకు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట స్థపతి భీమిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఈమని రాజ్యలక్ష్మి ఉన్నారు.

తొమ్మిది రోజులైనా తెరువని మోడల్ స్కూల్ హాస్టల్

- పసునూరులో ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు

పసునూరు ఆదర్శ పాఠశాల

నాగారం, జూన్ 21 : వేసవి సెలవుల అనంతరం విద్యా శాఖ పాఠశాలలను తిరిగి ప్రారంభించి తొమ్మిది రోజులు అవుతున్నా నాగారం మండలంలోని పసునూరు ఆదర్శ పాఠశాలలో బాలికల హాస్టల్‌ను తెరువలేదు. ఇందులో ఇంటర్మీడియట్ వరకు చదువు చెప్తుండగా టెన్త్, ఇంటర్ వారికే హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. సుమారు 100 నుంచి 120 మంది బాలికలు హాస్టల్‌ను వినియోగించుకుంటున్నారు. స్కూల్ ప్రారంభమై తరగతులు కొనసాగుతున్నా హాస్టల్ వసతి లేకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి నుంచి ఉదయం వచ్చి సాయంత్రం వెళ్లి పోతున్నారు. మధ్యాహ్ననానికి భోజనం ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. దీనికి కారణం మోడల్ స్కూల్ స్పెషల్ ఆఫీసరే కారణమని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. హాస్టల్ లేకపోవడంతో చాలా మంది బాలికలు స్కూల్‌కు రావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాలల ప్రారంభానికి రెండు రోజుల ముందే హాస్టల్ వసతులను పరిశీలించుకొని. జూన్ 12న హాస్టల్‌ను తెరువాల్సి ఉంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, హాస్టల్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎస్‌ఓ సిరీన్‌ను వివరణ కోరగా మోటార్ కాలిపోయిందని, చిన్నచిన్న మరమ్మతులు ఉండడం వల్ల హాస్టల్ తెరువలేదని తెలిపారు. విద్యార్థినులెవరూ హాస్టల్‌కు రాలేదని సమాధానం ఇచ్చారు.

ఏరువాక సంబురం

మేళ్లచెర్వులో ఎడ్లకు అరక కట్టి ఊరేగిస్తున్న రైతులు

మేళ్లచెర్వు/ చింతలపాలెం, జూన్ 21 : భూమి పుత్రుల పండుగైన ఏరువాక పౌర్ణమిని శుక్రవారం రైతులు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకొన్నారు. మేళ్లచెర్వు, చింతలపాలెంలో అరకలను శుభ్రం చేసి, కాడెద్దులను బుక్కాగులాములు చల్లి అందంగా ముస్తాబు చేసి మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. 'ఏరువాక సాగారో అన్నో చిన్నన్నా.. నీ కష్టమంతా తీరునురో అన్నో రైతన్నా' అనే సినీ గేయంతో ఊరేగింపు ఆసాంతం కొనసాగింది. తమ వ్యవసాయ పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండి అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షిస్తూ కర్షకులు తమ అరకలతో స్థానిక వినాయకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. కార్యక్రమంలో పెదకాపులు, గ్రామపెద్దలు, రైతులు, రైతు కూలీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చింతలపాలెం మండల కేంద్రంలోనూ రైతులు ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు.

నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

- జిల్లాలో 551 కేసులు నమోదు
- నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూన్ 21 : వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా నడుపవద్దని, ప్రతిరోజూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తామని నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 551 వాహనాలను పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చాలా మంది వాహనదారులు నంబర్ ప్లేట్లు లేకుండా ప్రయాణిస్తున్నారని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కొంత మంది నంబర్ ప్లేట్ లేకుండా వాహనాల నడుపుతూ నేరాలు, దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రతి వాహనానికి నంబర్ స్పష్టంగా కనిపించే విధంగా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తారని పేర్కొన్నారు.

24న ఎంజీయూలో జాతీయ సెమినార్

రామగిరి, జూన్ 21 : తెలంగాణ కామర్స్ అసోసియేషన్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎంజీయూలో ఈ నెల 24న నిర్వహించే జాతీయ సెమినార్‌కు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని కళాశాల కామర్స్ అధ్యాపకులు, హెచ్‌ఓడీలు విధిగా హాజరుకావాలని సెమినార్ కన్వీనర్, ఎంజీయూ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ హెచ్‌ఓడీ ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ 5వ వార్షికోత్సవం పురస్కరించుకొని ఎంజీయూ లో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్' అనే అంశంపై నిర్వహించే జాతీయ సెమినార్‌కు దేశంలోని వివిధ యూనివర్సిటీల నుంచి సీనియర్ ప్రొఫెసర్స్, పరిశోధన విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కేరళ సెంట్రల్ వర్సిటీ వీసీ దివంగత హెచ్.వెంకటేశ్వర్లు జయంతి వేడుకలు సైతం ఇదే రోజు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు కూడా హాజరై సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాల కోసం 99483 61250 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.